క్లుప్తంగా

పెద్దాసుపత్రికి గ్రీన్ క్లాత్ విరాళం



ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు గ్రీన్ క్లాత్ అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు లియో టెక్ లినెన్ అండ్ ల్యాండ్రీ సర్వీసెస్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్వాలియర్ కంపెనీకి చెందిన వెయ్యి మీటర్ల గ్రీన్ క్లాత్‌ను ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ వెంకటతులశమ్మ, గ్రేడ్–2 నాగమణి, సావిత్రిబాయి పాల్గొన్నారు.

గుండెజబ్బులకు అత్యాధునిక వైద్యసేవలు

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని కార్డియాలజిస్టులు చైతన్యకుమార్, తేజానందన్‌రెడ్డి, బీఎస్ ప్రవీణ్, గుండెశస్త్రచికిత్స నిపుణులు నిశిత అశోక్ ఉడపి తెలిపారు. స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో 20 వేలకు పైగా గుండె ప్రక్రియలు, గుండె శస్త్రచికిత్సలు పూర్తి చేసిన సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండె సమస్యలను కచ్చితత్వంతో గుర్తించడం, వ్యాధి ఏ స్థాయిలో ఉందో తెలిపే పరీక్షలు అందుబాటులోకి రావడం, అత్యాధునిక పరికరాలు ఉండటం వల్ల ఎంతో క్లిష్టమైన ప్రక్రియలు, ఆపరేషన్లు సులభంగా చేయగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతుండటం వల్ల ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీ2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్‌టౌన్‌లోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, గీతామందిర్ ఏరియా, దండిగేరి, ఉస్మానియా కాలేజీ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నగర సాంఘిక్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసు రెడ్డి తెలిపారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచార ప్రముఖ్ కురిడి సురేష్‌కుమార్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సీనియర్ కళాకారుడు శ్రీనివాసులు మృతి

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సర్విశెట్టి శ్రీనివాసులు (79) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హౌసింగ్ బోర్డు కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. శ్రీనివాసులు జెడ్పీ సీఈఓగా పదవీ విరమణ పొంది విశ్రాంత జీవితం కొనసాగిస్తూ కళా రంగానికి విశేష సేవ చేశారు. ఆయన మృతి పట్ల కళాకారులు, కళా సంస్థల ప్రతినిధులు సంతాపం ప్రకటించారు.

జాబ్ మేళాలో 82 మందికి ఉద్యోగాలు

కర్నూలు సిటీ: స్థానిక బంగారుపేటలోని కర్నూలు డిగ్రీ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 82 మందికి ఉద్యోగాలు వచ్చాయని ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు తెలిపారు. 180 మంది విద్యార్థులు హాజరు కా గా పిరామల్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, నవ భారత్ ఫర్టిలైజర్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీల్లో సేల్స్, అసిస్టెంట్ మేనేజర్, రీజినల్ మేనేజర్ వంటి ఉద్యోగలకు ఆయా కంపెనీలు ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభను ఆధారంగా తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకున్నారన్నారు.

పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయి

కర్నూలు (టౌన్): పన్ను వసూలు కేంద్రాలు ఆది, సోమవారాలు కూడా పనిచేస్తాయని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ఆస్తి పన్ను బకాయి దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ బిల్లులు కూడా..

కర్నూలు(అగ్రికల్చర్): సెలవు దినాలైనప్పటికీ ఆది, సోమవారాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని ఎస్ఈ ఎం.ఉమాపతి శనివారం తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

క్షయ అంతానికి పంతం!

- 2025 నాటికి గణనీయంగా కేసులు తగ్గించేందుకు చర్యలు
- జిల్లాలో ప్రస్తుతం 4,709 మందికి క్షయ వ్యాధి
- అందులో 113 మందికి ఎండీఆర్ టీబీ
- వీరికి రూ.లక్షల విలువ చేసే మందులు ఉచితం
- నేడు వరల్డ్ క్షయ వ్యాధి అవగాహన దినం

క్షయ వ్యాధి అంటే ఒకప్పుడు భయపడేవారు. ఆ వ్యాధి ఉన్న వ్యక్తిని చూస్తే ఆమడదూరం పారిపోయేవారు. ఈ వ్యాధిపై అవగాహన వచ్చాక రోగిని ఆదరిస్తున్నారు. వారూ మనలాంటి వారేనని పలకరిస్తున్నారు. వారి ఆలనాపాలనా దగ్గరుండి చూస్తున్నారు. శరీరాన్ని ఛిద్రం చేసే ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వస్తుంది. వైద్యులు సూచన మేరకు మందులు వాడితే ప్రాణాలు భయమే లేదు. ఎంత మంది రోగులు ఉన్నా ప్రభుత్వమే ఉచితంగా చికిత్స, మందులు అందిస్తోంది. ఈనెల 24న ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం. – కర్నూలు(హాస్పిటల్)

జిల్లాలో నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్‌ను 2003 మార్చిలో ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి 2 లక్షల నుంచి 2.5 లక్షల జనాభాకు ఒక టీబీ యూనిట్ చొప్పున 9 యూనిట్లు ఏర్పాటయ్యాయి. క్షయ వ్యాధి కేసులను గుర్తించేందుకు ప్రతి సీహెచ్‌సీలోనూ ఎక్స్‌రే యూనిట్లను ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నాలుగు నెలల మందుల స్టాక్‌ను సిద్ధంగా ఉంచుతున్నారు. ఈ వ్యాధిని మైక్రోస్కోప్, ట్రూనాట్, సీబీ నాట్ మిషన్‌ల ద్వారా నిర్ధారిస్తారు.

తగ్గుతున్న క్షయ వ్యాధి కేసులు

జిల్లాలో క్షయ వ్యాధి గ్రస్తుల సంఖ్య తగ్గుతూ ఉంది. 2020లో 3,638 కేసులుండగా మందులు వాడి 3,271 మందికి నయం అయ్యింది. అలాగే 2021లో 4,495 మందికి గాను 4,105 మందికి, 2022లో 5,139 మందికి గాను 4,785 మందికి, 2023లో 4,709 మందికి గాను 4,467 మందికి నయం అయ్యింది.

ఉచితంగా మందులు

అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి గ్రస్తులకు డాట్ ప్రొవైడర్ల ద్వారా 6 నుంచి 8 నెలల పాటు మందులు ఉచితంగా అందజేస్తున్నారు. సరిగా మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. రూ.2 లక్షల నుంచి రూ.18 లక్షల విలువ జేసే ఈ మందులను సైతం ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మందులతో పాటు రోగి పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.500 చొప్పున అందజేస్తున్నారు.



జిల్లా క్షయ వ్యాధి నివారణ కేంద్రం

ఖరీదైన మందులు సైతం..

మందులకు లొంగని క్షయ వ్యాధిగ్రస్తున్ని మల్టీడ్రగ్ రెసిస్టెంట్(ఎండీఆర్) టీబీ వ్యక్తిగా నిర్ధారిస్తారు. ఇలాంటి వారికి రెండేళ్ల పాటు ప్రత్యేకమైన మందులతో చికిత్స అందిస్తారు. దాదాపు ఒక్కొక్కరికి రూ.2లక్షల దాకా ఖర్చవుతుంది. ఈ మందులు కూడా పనిచేయని కొంతమందికి బెడాక్విలైన్, డెలామనిడ్ మందులను ఇస్తున్నారు. రెండేళ్ల కోర్సులో ఆరు నెలల పాటు ఇస్తారు. ఈ వ్యక్తికి అయ్యే ఖర్చు మొత్తం రూ.18 లక్షలు. ప్రస్తుతం జిల్లాలో 113 మంది ఎండీఆర్ టీబీ రోగులు ఉండగా అందులో 42 మందికి బెడాక్విలైన్ మందులు ఇస్తున్నారు.

కర్నూలు, ఆదోనిలలో సీబీ నాట్ మిషన్లు

క్షయ వ్యాధిని కచ్చితంగా నిర్ధారించే సీబీ నాట్ మిషన్లు 2016లో కర్నూలు మెడికల్ కాలేజీ, ఇటీవల ఆదోని ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటు చేశారు. ఈ మిషన్ హెచ్ఐవీ రోగుల్లో, ఊపిరితిత్తుల వ్యాధులున్న వారిలో, చిన్నపిల్లల్లో క్షయ, ఎండీఆర్ టీబీని గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. కర్నూలు మెడికల్ కాలేజీతో పాటు విశ్వభారతి మెడికల్ కాలేజీలకు మూడు ఫ్లోరోసెంట్ మైక్రోస్కోప్‌లను ఇంటర్నేషనల్ యూనియన్ అగైన్స్ట్ లంగ్ డిసీజెస్ అండ్ ట్యూబర్‌క్లోసిస్ సరఫరా చేశారు. ఎండీఆర్ క్షయ కేసులకు చికిత్స చేసేందుకు గాను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

నిక్షయ మిత్ర ద్వారా సరుకులు

నిక్షయ్ మిత్ర ద్వారా కో ఆపరేటివ్, కార్పొరేట్, ప్రజాప్రతినిధులు, వ్యక్తిగతంగా, పలు రకాల సంస్థలు, ఎన్‌జీఓలు, రాజకీయపార్టీల ద్వారా క్షయ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 61 సంస్థలు రిజిస్టర్ కాగా వారిలో 135 మంది క్షయ రోగులను దత్తత తీసుకుని పోషకాహారాన్ని అందజేస్తున్నారు.

నేడు క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన జిల్లా క్షయ నివారణ కేంద్రంలో మాట్లాడుతూ మెడికల్ కాలేజీలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఇప్పటికే క్షయ వ్యాధిని పురస్కరించుకుని వైద్య విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించామని, విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. సమావేశంలో టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయ లక్షణాలు

రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నా, దగ్గినప్పుడు గళ్ల పడినా, బరువు తగ్గినా, ఆకలి లేకపోయినా, ఉమ్మిలో రక్తం పడినా క్షయగా అనుమానించి వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా గళ్ల పరీక్ష, ఎక్స్‌రే తీస్తున్నారు. ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో సీబీనాట్, ఆర్‌టీపీసీఆర్ పరీక్ష నిర్వహిస్తున్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్ ప్రక్రియ

కర్నూలు (లీగల్): కర్నూలు బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. అధ్యక్ష స్థానానికి బి.చంద్రుడు, బి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్ష స్థానానికి ఎం.నిత్యజీవరాజు, ప్రధాన కార్యదర్శి స్థానానికి బీఎస్ రవికాంత్ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, వి.కృష్ణమూర్తి నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సంయుక్త కార్యదర్శి స్థానానికి డి.విక్రమ్ సింగ్, కోశాధికారి స్థానానికి ఎం.మహబూబ్ బాషా, గౌతమ్ మానే, గ్రంథాలయ కార్యదర్శి స్థానానికి ఎస్.రామ్‌నాథ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి స్థానానికి బంగి సుదీర్, మహిళా ప్రతినిధి స్థానానికి జి.సుమనా రాణి నామినేషన్లు దాఖలు చేశారన్నారు. సోమవారం నామినేషన్ ఉపసంహరణ ఉంటుందని, అదే రోజు బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 28న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు పోలింగ్, 3 నుంచి కౌంటింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఓర్వకల్లు: ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం హుసేనాపురం ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా సమయానుసారంగా టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో ప్రసవ గది, ల్యాబ్, ఐసీ, ఓపీ, మందుల స్టోర్‌ను పరిశీలించారు. నిత్యం వైద్యులు ప్రజలకు అందుబాటులో వుంటూ, మెరుగైన సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కృష్ణాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, స్టాఫ్ నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భార్గవతేజ



ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): ప్రజాస్వామ్యంలో ఓటు శక్తివంతమైన సాధనమని, రాజ్యాంగం ఇచ్చిన అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ సూచించారు. శనివారం బుధవారపేటలోని చెట్టు కింద బడి ప్రాంతం నుంచి మారెమ్మ ఆలయం వరకు ఓటు వినియోగంపై మెప్మా ఆధ్వర్యంలో పొదుపు గ్రూపు మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర కీలకమైనదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొని, తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ విజయభారతి, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ పెంచలయ్య పాల్గొన్నారు.

మైనార్టీలకు దన్నుగా వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరిని సన్మానిస్తున్న పార్టీ మైనార్టీ విభాగం నాయకులు

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక జొహరాపురం రోడ్డులోని మారుతీ మెగా సిటీలో ఉన్న స్వగృహంలో పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు జిలానీబాషా ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా ఉందన్నారు. గతంలో ఏన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించిందన్నారు. జిలానీబాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా ఇంతియాజ్‌ను ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇంతియాజ్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కృషి చేస్తా



ఇఫ్తారు విందులో ఇంతియాజ్, హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగర అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని ఆల్మాస్ మసీదులో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో కలిసి ఇఫ్తారు విందులో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు. అలాగే అశోక్‌నగర్‌లోని మదీనా మసీదులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనలు చేశారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



ఏఐటీయూసీ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు. చిత్రంలో జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేసి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు అన్నారు. శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని వామపక్ష పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో స్టేడియం, ఆర్ఎస్ రోడ్డు, చిరంజీవి పార్కుల వద్ద ఆయా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, అబ్దుల్, రామన్న ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఐటీసీ ఆటో యూనియన్ అడ్డాలో సీఐటీయూ నాయకులు ఎం.గోపాల్,సాయిబాబా, ప్రసాదు శర్మ, జీఎన్ శేష య్య ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. భగత్‌సింగ పోరాట స్ఫూర్తితో పోరాటాలను ఉద్ధృతం చేస్తామని ఉయ్యాలవాడ సర్కిల్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, మహేష్‌లు ప్రకటించారు. శనివారం రాత్రి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం ఎదుట కర్షక, కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలొ క్యాండిల్ లైటింగ్ నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. కల్లూరులో ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐటీయూసీ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్ర పటాలకు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్ నివాళులర్పించారు.

గణేష్ నగర్‌లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కర్నూలు: గణేష్ నగర్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుదాఘాతం ఏర్పడటంతో పక్కనే ఉన్న లక్ష్మీదేవి హోటల్‌కు మంటలు వ్యాపించాయి. ఫ్రిడ్జ్‌తో పాటు ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. కర్నూలు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. హోటల్ నిర్వాహకులకు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది అంచనా వేశారు.

హమ్మయ్యా.. మేల్కొన్నారు!

కర్నూలు (టౌన్): హమ్మయ్యా.. మున్సిపల్ అధికారులు మేల్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగేశారు. కోడ్ అమలవుతున్నా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయకుండా వదిలేసిన విషయమై 'అధికారులూ.. ఇంకెప్పుడు మేల్కొంటారు?' శీర్షికన 'సాక్షి' శుక్రవారం కథనం ప్రచురించింది. శనివారం మున్సిపల్ అధికారులు స్పందించి ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన హ్యాండ్‌బాల్ రాష్ట్ర జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం విభూష పట్టణంలో నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టును ప్రకటించారు. ఎంపికైన జట్టును ఏపీ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అభినందించారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా నారాయణపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

రూ.4.3 కోట్ల సీనరేజ్ చార్జీల వసూలు



డిమాండ్ డ్రాఫ్టును జిల్లా మైనింగ్ డీడీకి అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): మేగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేపట్టిన చెన్నై – సూరత్ జాతీయ రహదారి పనులకు సంబంధించి సీనరైజ్ చార్జీల కింద రూ.4.03 కోట్లు వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను మహబూబ్‌నగర్ నేషనల్ హైవే పీడీ శనివారం అందజేశారన్నారు. ఆయన మాట్లాడుతూ మెగా ఇంజినీరింగ్ కంపెనీ చేపట్టిన చెన్నై– సూరత్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఎగ్జిట్ టన్నెల్ పనులకు సంబంధించి సీనరేజ్ ఫీజు, డీఎంఎఫ్, ఇతర ట్యాక్స్‌ల కింద రూ.4,03,51,800 జమ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, మేగా ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు శనివారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.050 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో కవాతు చేస్తున్న పోలీసులు

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని, అందుకు పోలీస్ యంత్రాంగం సహకారం ఉంటుందని కర్నూలు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ ఎం.నరేష్ అన్నారు. శనివారం ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన లక్ష్మీపురం, పెద్దటేకూరు, చిన్నటేకూరు, ఉలిందకొండ, కొంగనపాడు, నాయకల్లు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలసి కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ తనిఖీ



గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం లక్ష్మీపురం పరిధిలో ఉన్న రాయలసీమ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శనివారం తనిఖీ చేశారు. రాయలసీమ ఫెరోర్ ల్యాస్టింగ్ ప్లాంట్‌లో జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ డీడీ విలేకరులతో మాట్లాడుతూ ఇనుప ఖనిజం ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారు, వాటికి సంబంధించిన రాయల్టీ పర్మిట్లు ఉన్నాయా లేదా, ఎవరి నుంచి కొన్నారనే వివరాలను ఆరా తీశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

25న పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 25న ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 17 ఏళ్లలోపు బాలబాలికలు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, మరిన్ని వివరాలకు 96661 24940 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

భోగేశ్వరంలో పదహారు రోజుల పండుగ

గడివేముల: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శనివారం భోగేశ్వరంలో పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు శ్యామ్ సుందర్‌శర్మ విశేష పూజలను నిర్వహించారు. అందులో భాగంగా చండీశ్వరుడు, త్రిశూలదేవత ఆధ్వర్యంలో అంకురాలకు ఉద్వాసన పలుకుతూ కోనేరులో కలిపారు. అనంతరం రథం వద్దకు చేరుకొని వివిధ ద్రవ్యాధిపూజలు నిర్వహించి రథాన్ని భక్తుల మధ్య రథ మండపంలోకి చేర్చారు. అమ్మవారికి చీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పూజ కార్యక్రమాల్లో చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.